Transient Ischaemic Attack కాదని. మానసికంగా గాయపడ్డారు అంతే...”

ఒంటరి తనంతో బాధపడే ఓ వ్య క్తికి అణువంత ఉపశమనం అందించేది ఆత్మీయుల పరామర్శే అయితే ఇదిగో ఇప్పుడు అలాంటి వూరటనే అందించగలిగాడు డాక్టర్ మహంతి. అందుకేనేమో ఆమె కళ్ళు తడయ్యాయి. “ఓ సారి వెళ్ళి తాతయ్యని కలుసుకోవచ్చుగా”

“దానివలన ఉపయోగం లేదు అంకుల్” బలవంతంగా నవ్వాలని ప్రయత్నించింది. “డిఫెన్స్ టెండర్ పోవటానికి నేనే కారణమనుకుంటున్నారు గ్రాండ్‌పా. అఫ్‌కోర్స్ అది నిజమే.....”

“కాని ఆ వ్య క్తే అంతకుముందు నీ సమర్ధతకి పొంగిపోయేవాడు . . .”

బాధగా తల వంచుకుంది కృషి.

“ఎందుకలా బాధపడతావు”

“శక్తికి మించిన పోరాటంలో అడుగుపెట్టాను అంకుల్. అదీ కావాలనే. . . కాని ఏదో చెయ్యాలనే ప్రయత్నించిన నేను గ్రాండ్‌పాని ఇంత నష్టానికి గురి చేసాను.”

“ప్రత్యర్ధితో యుద్ధానికి సిద్ధపడ్డప్పుడు మనం కొన్ని గాయాలకి ప్రిపేర్ కావాలి కృషి - నీ మూలంగా చౌదరికి తగిలిన దెబ్బల కన్నా చౌదరి మూలంగా నీ గ్రాండ్‌పాకి అయిన గాయం చాలా స్వల్పం కాబట్టి నువ్వు బాధ పడాల్సిన అగత్యం లేదు ఈ విషయం మీ గ్రాండ్‌పాకి తెలీక కాదు. . .”

అ తర్వాత చాలా సేపటిదాకా నిశ్శబ్దం ఆవరించింది.

“అంకుల్”

వెళ్ళబోయిన మహంతి ఆగాడు.

“నాకో క్లారిఫికేషన్ కావాలి” చెప్పింది జీవిత రాజేంద్రల ఆత్మహత్యా ప్రయత్నం గురించి క్లుప్తంగా “ఇద్దరూ విషం త్రాగారు కాని చనిపోయింది జీవిత మాత్రమే.”

“విషం త్రాగాక ప్రభావం ఇద్దరిమీదా వుంటుంది కృషి. కాకపోతే ఎక్కువ విషం పుచ్చుకున్నవాళ్ళు చనిపోతారు. తక్కువ తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడతారు.”

అంతే. . .

యధాలాపంగా డాక్టర్ మహంతి చెప్పిన జవాబులో చాలా ప్రశ్నలకి సమాధానం దొరికింది. అంటే ఓ పథకం ప్రకారం జీవితని హత్య చేశారు రాజేంద్ర, రామనాథ్ చౌదరిలిద్దరూ.

డాక్టర్ మహంతి వెళ్ళిన ఐదు నిమిషాల దాకా అదే విషయం గురించి ఆలోచించిన కృషి ఇక నిభాయించుకోలేక ఫోన్ అందుకోబోయి ఆగింది ద్వారం దాటి వస్తున్న విశ్వని చూస్తూ-

ఎప్పుడూ చాలా వుత్సాహంగా వుండే విశ్వ ఆ క్షణంలో బిడియంగా తల వంచుకోవడన్ని ఆమె గమనించినా నిశ్శబ్దంగా వూరుకోలేదు. . .

“మిస్ కృషి. . నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థమౌతుందా”

“ఆవేశపడకు విశ్వ . . . జీవితనే ఓ అమాయకురాలి ప్రాణాలు తీసే తమ పథకంలో చౌదరి నీకెంతిచ్చాడు”

విశ్వ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

“డబ్బుకోసం నువ్వేదన్నా చెయ్యగల సమర్ధుడివేగా విశ్వా. అసలు నీకు ప్రపంచంలో చాలా ముఖ్యమైనది డబ్బేగా?”

“పిచ్చిపిచ్చిగా మాట్లాడకు”

“ఏం నీకూ కోపం వస్తుందా. . . అలా రావాల్సింది ఆత్మాభిమానం వున్న వాళ్ళకి” అతని మొహం వివర్ణమౌతుంటే క్రోధంగా అడిగింది. “చెప్పు విశ్వ . . .కొన్ని రోజులపాటు అజ్ఞాతంగా వుండి తర్వాత పెళ్ళి చేసుకొని జీవితని ఇంటికి తీసుకుని వెళ్తానని నీకు హామీ ఇచ్చిన రాజేంద్ర వెళ్ళిన గంటలో ఆత్మహత్యకి ఎందుకు సిద్ధపడ్డాడు. ఆ ప్రయత్నంలో కేవలం జీవిత మాత్రమే ఎందుకు ప్రాణాలు కోల్పోయింది.”

షాక్ తిన్నట్టుగా చూశాడు అతను. ఇలాంటి విశ్లేషణకి ఆ క్షణం దాకా అతడు సిద్ధపడలేదు.

“నీ హెచ్చరికతో చౌదరి కలవరపడ్డాడు. నీ ద్వారా నన్ను సాధించాలనుకున్న చౌదరి నీకు అనుమానం రాకుండా కొడుకుతో ఓ పథకం వేశాడు. ఆ పథకం జీవిత ప్రాణాలు తీయడం. అలా తను కోరిన మంత్రిగారి కూతుర్ని తన కోడల్ని చేసుకోవడం. అది నీకు అర్థం కాలేదు. కాబట్టి రాజేంద్ర అడిగాడని నా దగ్గరకొచ్చావు. కేవలం నా మీద గెలుపు సాధించాలనే ఒకే ఒక్క ధ్యేయంతో నన్ను కూడా నమ్మించి జీవితని తీసుకెళ్ళిపోయావ్ “జీవిత ఆలోచనలతో మనస్సు ద్రవించిందేమో కళ్ళలో పేరుకున్న నీటి పొరల్ని దాచేసుకుంటూ అంది “ఇక్కడ పొరపాటు నీది కూడా కాదు విశ్వా నీ తండ్రి విషయంలో పగ తీర్చుకోవాలని ఈ ఇంట అడుగుపెట్టావే తప్ప నువ్వు డబ్బు కోసం హత్యలు సైతం చేసే హంతకుడివని నేను అనుకోకపోవడం. యస్ - అదే జీవితని నేను నీకు అప్పచెప్పటానికి కారణమైంది. అలా చూడకు విశ్వా. ఒక మేధావి ఆలోచనా సరళిలో సైతం ఒక్కోమారు అపశృతి ధ్వనించే అవకాశం వుంటుందన్న అరిస్టాటిల్ సూక్తి నిజమైతే చాలా తెలివైనదానిననుకున్న నేనూ ఓ మూర్ఖురాలిలా ప్రవర్తించాను. . . ప్రత్యేకించి నీకీ విషయం ఎందుకు చెబుతున్నాను అంటే ఒకనాడు నాతో ఒకరాత్రి గడపాలనుకుంటున్నానన్న నువ్వు అలాంటి అవకాశం దొరికినా నన్ను మత్తులో ముంచి ఫోటోలకే నీ తెలివిని పరిమితం చేసుకున్నావు తప్ప నన్ను అనుభవించటానికి కాదుగా... నన్ను అనుభవించడమే నీ ధ్యేయమైతే అది ఆ రాత్రి నీకు సాధ్యమయ్యే విషయమేగా. అదిగో అక్కడ నువ్వు ఓ పగతో ఈ ఇంట ప్రవేశించిన మనిషివే తప్ప అవకాశం దొరికినా ఓ ఆడపిల్లపై అఘాయిత్యం చేయవని అర్థం చేసుకున్నాను. అసలు నీకు ఏం తెలుసని మా కుటుంబం మీద పగ తీర్చుకోవటానికి. . నీ తండ్రి

తెలుసా. . .”

“స్టాపిట్. . .” ఆవేశంగా అరిచాడు విశ్వ . “ఇంకేం మాట్లాడకు”

“మాట్లాడను విశ్వ. . . మాట్లాడినా ప్రయోజనం లేదని నాకు తెలుసు. ఎందుకంటే ఏ ఉపాధ్యాయ పతనాన్ని నువ్వు కోరుకుంటున్నావో ఆ ఉపాధ్యాయ నాకన్నా నీ మాటకే ఎక్కువ విలువ యిస్తారని నాకు తెలుసు కాబట్టి. అయితే ఒక్క నిముషం . . . మన రాజకీయ చదరంగంలో నువ్వూ నేనూ ప్రత్యర్థులం అయినా రాజకీయాల్లో ఆలోచించాల్సింది ఎవరూ, ఏమిటీ అని కాదు. . . ఎవరు ఎవరి మనిషి అన్న విషయం. . . అది నువ్వు తెలుసుకునేదాకా నువ్వు చౌదరిని నమ్ముతుంటావు, ఉపాధ్యాయని ద్వేషిస్తూనే వుంటావు. . . ”

“అసాధారణమైన నీ మేధస్సుకి, అమోఘమైన నీ విశ్లేషణకి నా అభినందనలు కృషి . . . ఇప్పుడు మనం వెంటనే ఆలోచించాల్సింది తాత్కాలికమైన ప్రజ్ఞలగురించి కాదు - జీవితని నిజంగా హత్య చేశారా అన్న విషయం గురించి” ఆమె మాటల్ని ఖండిస్తున్నట్టుగా అన్నాడు.

రెప్పవాల్చకుండా చూసింది. “ప్రిజుడీస్‌తో ఈ ఇంట అడుగుపెట్టిన నీకు చౌదరి దుర్మార్గం గురించి చెప్పినా నమ్మకమేర్పడదు.”

అతడు బయటికి నడవబోయాడు.

“ఆగు మిస్టర్ విశ్వా. . . ఎప్పుడో కాదు నీ మిత్రుడు చౌదరి ఏమిటో అన్నది ఇప్పుడే నిరూపిస్తాను.”

“నువ్వది నిరూపించగలిగితే చౌదరికి నేను శత్రువునౌతాను.”

“శత్రువుగా మారతావో లేక యింకా మిత్రుడిగా కొనసాగి నీ భ్రాంతిలోనే నువ్వు బ్రతుకుతావో నీ యిష్టం” తన ఆలోచనల్ని అమలు పరుస్తున్నట్టుగా చూసింది. “నీ గదిలో వున్న ఫోన్ ద్వారా పేరలల్‌గా నాకూ చౌదరికీ జరిగే చర్చ వింటే జరిగింది నీకు అర్థమవుతుంది.”

అరనిముషం వ్యవధిలో తన రూంలోని ఫోన్ అందుకుని చౌదరికి డయల్ చేసింది కృషి.

“చౌదరి హియర్”

“నేనే”

ఫకాలున నవ్వాడు చౌదరి కృషి కంఠం వినగానే.

“మొత్తానికి అందర్నీ ఫూల్ చేయగలిగావు చౌదరీ”

“పాపం షాక్ తిన్నట్టున్నావు కదూ”

“నిజమే చౌదరీ. . . నిన్ను నేను తక్కువగా అంచనా వేసాను. అందుకే విశ్వాని నీకు ప్రత్యర్థిగా మార్చాలని ఓ పథకం వేసి దారుణంగా ఓడిపోయాను. జీవితనే ఓ పిచ్చిక మీద మీరు ఇంత పెద్ద బ్రహ్మాస్త్రాన్ని సంధించగలుగుతారని ఆలోచించలేక పోయాను.”

“దటీజ్ చౌదరీ. . . ఇక నా కొడుకు పెళ్ళికి అడ్డం తొలిగిపోయిందిగా. ఇప్పుడేం చేస్తావ్”

పోలీసుల్ని మభ్యపెట్టి సులభంగా జీవిత అడ్డం తొలిగించుకోగలిగావేమో కాని- ”

“ఆగిపోయావేం . . .”

“విశ్ను తండ్రి మోహన్‌గాంధీని నువ్వే హత్య చేయించావని నేను నిరూపించటానికి చేస్తున్న ప్రయత్నం నుంచి తప్పించుకోలేవు చౌదరీ”

చౌదరి పక్కనుంచి జవాబు లేదు.

“ఏం. .. కంగారుపడుతున్నావా చౌదరీ. . .గెట్ రెడీ. మన పోరాటంలో చివరి ఘట్టానికి చేరుకుంటున్నాం కాబట్టి కటకటాలు లెక్కపెట్టటానికి ప్రిపేరై వుండు”

“పిల్లకాకివి నువ్వెంత”

నవ్వింది.

“ఎందుకు నవ్వుతున్నావు”

“రాబందును చూసినట్టు బెంబేలు పడుతూ కూడా నన్నో పిల్లకాకినని ఎద్దేవా చేస్తున్నందుకు . . .”

“నీ సమాధికి పునాదుల్ని సిద్ధం చేస్తున్నాను కృషి”

“చూద్దాం చౌదరీ. . . ఎవరి సమాధి శంఖుస్థాపన ముందు జరుగుతుందో కాలానికే వదిలేద్దాం.”

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు.

అప్పుడు చూసింది కృషి విశ్ను జేవురించిన మొహాన్ని.

ఈ యింట ఎందుకు అడుగుపెట్టినా గాని ఏం చేయాలని యింత కాలమూ ఆలోచించినా గాని ఒక్క రోజులో ఒకే ఒక్క ఫోన్‌కాల్‌తో అతడి గమ్యం మారిపోయినట్టుగా అంతసేపూ పట్టుకుని వున్న రిసీవర్ని హుక్‌చేసి బయటికి నడిచాడు వేగంగా.

చాలా రోజుల తర్వాత కృషి రిలాక్స్‌డ్‌గా సోఫాలో కూర్చుంది.

ఇంత వరకూ జరిగినదాని గురించి కాక యికముందు జరగబోయే దాని గురించి ఉత్కంఠగా ఆలోచిస్తూందామె.

విశ్ను సరాసరి చౌదరి దగ్గరకు వెళ్ళలేదు. . . ఆశ్రమానికి వచ్చాడు.

తన మీద తనకే జుగుప్సలాంటి భావం పేరుకుపోతుంటే ఆలయంలోని ప్రశాంతతలా నిశ్శబ్దంగా వున్న కుటీరాల మధ్య మతి భ్రమించిన వాడిలా తిరిగాడు చాలా సేపటిదాకా. . .

ముకుళించుకున్న కాలం మౌనంగా రేకులు విప్పుకుని సరికొత్త మార్గాలనే నిర్ధేశిస్తుందో లేక మేధాకేదారంలోని నిశ్చల సమాధికే భంగమైనట్టు అనిపిస్తూందో కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

జీవితని ఒప్పించి నమ్మించి పంపింది తనేగా. . అన్నయ్యాలా నేనున్నానని హామీ యిచ్చి మృత్యు గహ్వారంలోకి నెట్టింది తనే అయినప్పుడు ఈ పాపానికి నిష్కృతి ఎక్కడ - ఉనికిలేని

చేయాలని యాత్ర ప్రారంభించిన తను మరో తల్లి కడుపు కోతకి కారణమైపోయాడే. దీనికి జవాబుగా తానేమివ్వగలడు.

"విశ్వా"

సమీపంలో చైతన్యానంద నిలబడి వున్నాడు.

"ఏమైంది"

ఆ కొద్దిపాటి పరామర్శకే విశ్వ కళ్ళనుంచి జలజలా నీళ్ళు రాలాయి. "నేను ఓడిపోయాను బాబా"

ఆప్యాయంగా స్పృశించారు "ఉరకలు వేస్తూ పరుగులిడే నదీ ప్రవాహం చివరికి లయమయ్యేది కడలిలోనే అయినా అది ఓటమికాదు విశ్వా - ప్రాణులకి వెలుగుని ప్రకృతి పుష్పాల సౌరభాల స్ఫూర్తికి కాంతినీ అందించే సూర్యుడు ప్రతిరోజూ అస్తమిస్తున్నా అదికూడా ఓటమికాదు. జీవితం జీవిత సత్యాలకది సంకేతం సంఘాన్ని సంస్కరించాలనుకునే వ్యక్తులకి సైతం తప్పని మానసిక గ్లాని మామూలు మనుషులకి తప్పనిదేగా - తప్పనిదనుకోవాలి. తప్పయితే తెలుసుకోవాలి. అదే మనిషి చేయగలిగేది"

ఎంత ఊరటగా అనిపించింది.

ఆ తర్వాత బాబా నుంచి శలవు తీసుకున్న విశ్వ తన కుటీరం వేపు నడిచాడు.

"ఏమిటి. ఇంత అర్ధరాత్రి - " సూరి పలకరించాడు. ఈ మధ్య విశ్వ వుంటున్నది ఉపాధ్యాయగారి ఇంటిలోనే అని తెలిసిన సూరి విశ్వ ముఖకవళికల్ని గమనిస్తూ అడిగాడు "ఏమైంది"

జవాబు చెప్పలేదు.

"పాపం జీవితనే అమ్మాయి చనిపోయిందటగా"

"కాదు చంపబడింది" అంతటితో ఆగకుండా సూరికి అంతా వివరంగా చెప్పాడు.

సూరి మౌనం విశ్వని మరింత గాయ పరుస్తూంటే ఇక సంభాళించుకోలేనట్టుగా ఉద్రేకంగా సూరి భుజాల్ని పట్టుకున్నాడు. సూరి కంపించిపోతుంటే "చెప్పరా - ఒకనాడు నేను గాయాలతో హాస్పిటల్లో అడ్మిటైతే నా గురించి డబ్బు ఖర్చు చేసింది నేను బ్రతకాలని డాక్టర్లని అర్థించింది కృషే కదూ."